సాక్షి తిరుపతి

సోమవారం । 10 । మార్చి । 2025

● తెప్పోత్సాహం



శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలకు ఆదివారం వైభవంగా శ్రీకారం చుట్టారు. తొలిరోజు సీతాలక్ష్మణ సమేతంగా కోదండరామస్వామివారు ప్రియభక్తుడు ఆంజనేయునితో కలిసి తెప్పపై కొలువుదీరారు. అశేష భక్తుల గోవిందనామస్మరణల నడుమ పుష్కరిణిలో విహరించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య జనులను అనుగ్రహించారు. సమస్త లోకాలకు సర్వశుభాలు సిద్ధించాలని ఆశీర్వదించారు. – తిరుమల

● దివికేగిన దివ్యగానం



గరిమెళ్ల భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న భూమన

శ్రీవారి సేవలో తరించిన సంగీత శిఖరం నేలకొరిగింది.. అన్నమయ్య సంకీర్తనలను స్వరపరచిన భక్తి గానం మూగబోయింది.. టీటీడీ ఆస్థాన విద్వాంసునిగా విశేష సేవలందించిన గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ శకం పరిపూర్ణమైంది. వినరో భాగ్యము విష్ణుకథ అంటూ ఆలపించిన అపూర్వ గాత్రం వైకుంఠనాథుని సన్నిధికి తరలివెళ్లింది. నిత్యం దైవనామస్మరణతో పునీతమైన సాహిత్య దిగ్గజం దివికేగింది. – తిరుమల



ఓదారుస్తూ.. పరామర్శిస్తూ..



న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం



వైఎస్ జగన్‌తో సుబ్రమణ్యంరెడ్డి

చిల్లకూరు : వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌వీ సుబ్రమణ్యంరెడ్డి ఆదివారం తాడేపల్లె నివాసంలో వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పటిష్టతకు ఎప్పటికప్పుడు సలహాలు అందించాలని సూచించారు.

ఉత్తమ అంగన్‌వాడీగా బుజ్జమ్మ



అవార్డు అందుకుంటున్న బుజ్జమ్మ

రేణిగుంట : శ్రీకాళహస్తి మండలం జగ్గరాజుపల్లె అంగన్‌వాడీ కార్యకర్త ఎం.బుజ్జమ్మ జాతీయ స్థాయి అవార్డు అందుకున్నారు. శనివారం న్యూఢిల్లీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమెకు పురస్కారం ప్రదానం చేశారు. ఆదివారం ఈ మేరకు సీడీపీఓ శాంతిదుర్గ, సూపర్‌వైజర్ మంజుల అభినందించారు.

సేవలు.. సర్వేనాశనం



సచివాలయ సిబ్బందిపై ప్రభుత్వం కక్షగట్టింది. వివిధ రకాల సర్వేల పేరుతో నిత్యం వేధింపులకు గురిచేస్తోంది. సెలవు రోజుల్లో సైతం శిక్షణ పేరుతో ముప్పతిప్పలు పెడుతోంది. అన్ని శాఖల పనులను వారి నెత్తిపైనే రుద్ది పొమ్మనలేక పొగబెడుతోంది. ఈ క్రమంలోనే ప్రజలకు సకాలంలో సేవలు అందకుండా అడ్డుపడుతోంది. ఉన్నత ఆశయంతో ఏర్పాటు చేసిన వ్యవస్థను నీరుగార్చేందుకు యత్నిస్తోంది. ఈ మేరకు సర్కారు నిర్వాకంతో జనం తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్.. మండల కార్యాలయాల వద్ద బారులు తీరుతున్నారు. సులభతరంగా అందుతున్న సేవలను దూరం చేశారని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా పాలకుల వ్యవహారశైలి మారకుంటే గుణపాఠం తప్పదని హెచ్చరిస్తున్నారు.

- సచివాలయ సిబ్బందిని ముప్పతిప్పలు పెడుతున్న ప్రభుత్వం
- నాలుగు నెలలుగా 36 రకాల సర్వేలతో ప్రజా సేవకు దూరం
- సమస్యలు తీర్చేవారు లేక కలెక్టరేట్, మండల కార్యాలయాలకు జనం

సాక్షి ప్రతినిధి, తిరుపతి : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సేవకే పెద్దపీట వేసింది. అందులో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో 35 శాఖలకు సంబంధించి సుమారు 500 సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రధానంగా పింఛన్, రేషన్ కార్డులు, ఇంటి పట్టాలు, సివిల్ పనులు, వైద్యం, ఆరోగ్యం, రెవెన్యూ సమస్యలు, భూముల సర్వే, శిశు సంక్షేమం, డెయిరీ, పౌల్ట్రీ వంటి అనేక అంశాలకు సంబంధించిన సేవలను ఆయా గ్రామాల్లోనే ప్రజలు వినియోగించుకునే వెసులుబాటు కల్పించింది. అర్జీ పెట్టుకున్న 72 గంటల్లోనే సమస్యను పరిష్కరించాలని స్పష్టంగా ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సచివాలయ సిబ్బందికి తోడుగా వలంటీర్లను నియమించింది. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేసేలా దిశానిర్దేశం చేసింది.

కత్తిగట్టిన కూటమి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సచివాలయ వ్యవస్థపై కత్తిగట్టింది. పల్లె పాలనను పూర్తిగా రద్దు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. అందులో భాగంగా తొలుత వలంటీర్లను పక్కనపెట్టేసింది. సచివాలయ సిబ్బందిని పలు సర్వేల పేరుతో వేధిస్తోంది. గతంలోనూ సర్వేలు చేపట్టినప్పటికీ.. పౌరసేవలకు భంగం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకునేవారు. ప్రస్తుతం పౌరసేవలను పూర్తిగా పక్కనపెట్టి 36 రకాల సర్వేలను సిబ్బందికి అప్పగించి ఊరూరా తిప్పుతోంది. సెలవు రోజుల్లోనూ సర్వేలపై శిక్షణ అని పిలిపించుకుంటూ ఇబ్బంది పెడుతోంది. ఈ క్రమంలో అన్ని శాఖలకు సంబంధించిన పనులను తమపై రుద్దుతుండడంపై సచివాలయ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన ఒత్తిడి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సచివాలయ సిబ్బందిపై ఒత్తిడి పెరిగింది. ముఖ్యంగా సర్వే అంటేనే భయపడే దుస్థితి దాపురించింది. తెల్లారితే సర్వే అని మొదలుపెడితే సాయంత్రానికి సర్వర్ డౌన్‌వుతోంది. రాత్రి ఇంటికి వెళ్లే సరికి సొమ్మసిల్లి పడిపోతున్నారు. ఆపై కూడా పంచాయతీ కార్యదర్శులు సర్వేలు చేయాలి. ఎంపీ, ఎమ్మెల్యే పర్యటనకు వస్తే వారి మీటింగ్‌ల నిర్వహణ చూసుకోవాలి.

ఫలితం ఇదీ..

సర్వేల కారణంగా సిబ్బంది పౌరసేవలకు దూరంగా ఉండాల్సి రావటంతో పశు వైద్యం మూగబోయింది. మహిళా పోలీసులను కూడా సర్వేలకు వాడుకోవడంతో పల్లెల్లో సారా, గంజాయి విక్రయాలతోపాటు బెల్టు షాపులు జోరందుకున్నాయి. సచివాలయ సిబ్బంది సర్వేలకు పరిమితం కావడంతో గ్రామస్థాయి నుంచి పైస్థాయికి సమాచారం చేరడం లేదు. కీలకంగా పనిచేయాల్సిన డిజిటల్ అసిస్టెంట్‌లు కూడా గట్టిగా సీట్లో కూర్చులేకపోతున్నారు. వారికి సైతం అదనపు పనులు అప్పగించడంతో ప్రజా సేవలు కుంటుపడుతున్నాయి. అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు కూడా పొలం బడిని వదిలేశారు. సచివాలయ సిబ్బందిని ప్రభుత్వం వివిధ శాఖలకు సర్దుబాటు చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

పని చేస్తున్నా.. తప్పుని ఫిర్యాదులు

మూలిగే నక్కపై తాటికాయపడ్డట్టుగా తయారైంది సచివాలయ సిబ్బంది పరిస్థితి. సర్వేలు, సొంత పనులు, సేవలు తలనొప్పిని తెచ్చిపెడుతుంటే.. మరో వైపు కూటమి నేతలు మరింతగా ఇబ్బందిపెడుతున్నారు. పని ఒత్తిడితో సతమతమవుతున్న ఉద్యోగులపై కావాలనే ప్రజాప్రతినిధులు, అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. తాము చెప్పినట్టు నడుచుకోవడం లేదని జులుం ప్రదర్శిస్తున్నారు. దీంతో ఎవరి మాట వినాలో తెలియక సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు.

జిల్లా సమాచారం	
మొత్తం సచివాలయాలు	691
ఉద్యోగులు	7,405
సచివాలయాల్లో పౌరసేవలు అందే సమయంలో కలెక్టరేట్ స్పందనకు వచ్చిన అర్జీలు	
2023 డిసెంబర్	554
2024 జనవరి	801
2024 ఫిబ్రవరి	802
కూటమి ప్రభుత్వంలో కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీలు	
2024 డిసెంబర్	942
2025 జనవరి	660
(రెండు వారాలు గ్రీవెన్స్ జరగలేదు)	
2025 ఫిబ్రవరి	948

కలెక్టరేట్‌కు వినతుల వెల్లువ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల కాలంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 80 శాఖలకు సంబంధించి మొత్తం 3,208 అర్జీలు వచ్చాయి. ఇందులో 1,896 వినతులను పరిష్కరించారు. మిగిలిన 1,312 ఫిర్యాదులను పరిష్కరించాల్సి ఉంది. అయితే పలు అర్జీలకు కచ్చితమైన పరిష్కారం లభించక ప్రజలు మాత్రం కలెక్టరేట్ చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆయా సచివాలయాల్లోనే సమస్యలు పరిష్కారమయ్యేవని అర్జీదారులు గుర్తుచేసుకుంటున్నారు. ప్రస్తుతం వాటిని నిర్వీర్యం చేయడంతోనే వివిధ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని మండిపడుతున్నారు.



కలెక్టరేట్‌లో బారులు తీరిన అర్జీదారులు (ఫైల్)

తిరుమలలో విస్తృత తనిఖీలు



తనిఖీ చేస్తున్న పోలీసులు

తిరుమల : తిరుమలలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు, విజిలెన్స్ అధికారులు ఆదివారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. నందకం, వకుళమాత, వరాహస్వామి అతిథిగృహాల వద్ద అనధికారికంగా వ్యాపారాలు సాగిస్తున్న 25 మంది నానల్ లోకల్, హ్యాకర్లను గుర్తించారు. నేర చరిత్ర ఏమైనా ఉందా తెలుసుకునేందుకు వేలిముద్రలు సేకరించారు. తిరుమలలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకే తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు.

అంబేడ్కర్ వర్సిటీ ఏర్పాటుకు డిమాండ్



ఎస్వీ ఆర్ట్స్ కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అంబేడ్కర్ వర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులు

తిరుపతి సిటీ: రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీని తక్షణం ఏర్పాటు చేయాలని అంబేడ్కర్ వర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ఎదుట పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. స్టడీసెంటర్ కో–ఆర్డినేటర్ డాక్టర్ వై మల్లికార్జున మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలు విడిపోయి 11ఏళ్లు పైబడినా ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్నారు. అన్ని రాష్ట్రాల కంటే ఏపీ నుంచి ఎక్కువ మంది యూజీ, పీజీ, డిప్లొమో కోర్సులలో ప్రవేశాలు పొందుతున్నారని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం తక్షణం వర్సిటీని ఏపీలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్ట్స్ కళాశాల అంబేడ్కర్ స్టడీసెంటర్ విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కుయ్యో..రొయ్యో!



హార్వెస్టింగ్ చేస్తున్న దృశ్యం

రోజురోజుకీ రొయ్య ధర పతనం

- తగ్గుతున్న ఎగుమతులు
- గగ్గోలు పెడుతున్న రైతులు

వాకాడు: రొయ్య ధరలు రోజురోజుకీ పతనమవుతున్నాయి. రోజుకి రూ.10 చొప్పున తగ్గిపోతుండడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఎగుమతి దారులు ప్రస్తుతం ఏ కారణం చెప్పకుండానే ధరలు తగ్గించేస్తున్నారు. దళారులు సిండికేట్‌గా ఏర్పడి మరింత పతనం చేస్తున్నారు. దీని వల్ల ఎకరాకు రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లుతోంది. గత నెల రొయ్యల ధరలతో లెక్కిస్తే రూ.4 వేల కోట్లు ఆదాయం రావాల్సి ఉంది. ఐతే ప్రస్తుత ధరలతో అది కాస్త రూ.3.5 వేల కోట్లకు పడిపోయింది.

జిల్లా సమాచారం	
రొయ్య సాగుచేసే మండలాల సంఖ్య	7
సాగులో ఉన్న విస్తీర్ణం	15 వేల హెక్టార్లు
ఎకరా సాగుకు అవుతున్న ఖర్చు	రూ.2 లక్షలు
రైతులు	7 వేల మంది
ఏటా దిగుబడి	1.5 లక్షల టన్నులు
ఇందులో ఎగుమతి	90 శాతం వరకు

రొయ్య ధరలు ఇలా

కౌంట్	ఫిబ్రవరిలో	మార్చిలో
40	రూ.415	రూ.350
50	రూ.375	రూ.335
60	రూ.345	రూ.315
70	రూ.310	రూ.285
80	రూ.290	రూ.255
90	రూ.270	రూ.235
100	రూ.260	రూ.225



రొయ్యలు గ్రేడింగ్ చేస్తున్న రైతులు

యూటర్న్

భారతదేశం నుంచి రొయ్య ఎగుమతులు ఎక్కువగా యూరోపియన్ దేశాలకు వెళ్తుంటాయి. యూరప్‌లోని 10 దేశాల్లో ఆంధ్రా రొయ్యలకు మంచి డిమాండ్ ఉంది. ఐతే కొంతమంది రైతులు అత్యుత్సాహానికి వెళ్లి నిషేధిత యాంటీ బయోటిక్స్ సాగులో వాడడం వల్ల యూరోపియన్ ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. కృష్ణపట్నం, విశాఖపట్నం, కాకినాడ నౌకాశ్రయాల ద్వారా ఎగుమతవుతున్న ప్రతి రెండు కంటైనర్‌లో ఒకదానికి శాంపిల్స్ తీస్తున్నారు. యాంటీ బయోటిక్స్ ఉన్నట్లు తేలితే ఎగుమతులు చేసే లైసెన్సులు రైతులు కోల్పోతున్నారు. ఐతే అమెరికా దేశానికి ఎగుమతయ్యే రొయ్య ఉత్పత్తును శాంపిల్స్ తక్కువగా తీస్తుండడంతో ఎక్కువ మంది రైతులు ఆ దేశం వైపు మొగ్గు చూపుతున్నారు.

నాసిరకం సీడ్, ఫీడ్

హేచరీలు అధిక ధరలతో నాసిరకం సీడ్ అంటగడుతున్నాయి. దీన్ని చెరువుల్లో పోసిన పది రోజులకే రొయ్య పిల్లలు విపరీతంగా చనిపోతున్నాయి. వాటిల్లో కొన్ని బతికి బయటపడ్డా అవి సమాన గ్రోత్ రావడం లేదు. వాటిని అమ్ముకుందామంటే రొయ్యల ప్రాసెస్ కంపెనీ వ్యాపారులు సిండికేట్లుగా ఏర్పడి అందినకాడికి దోసుకుపోతున్నారు. ప్రాసెస్ కంపెనీ వ్యాపారులదీ అదే పరిస్థితి.

మామూళ్లమత్తులో అధికారులు

నాణ్యమైన సీడ్ అందేలా చూడాల్సిన కోస్టల్ ఆక్వా అథారిటీ, మత్స్యశాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. వాస్తవానికి మత్స్యశాఖ అధికారులు నెలకు రెండు సార్లు హేచరీలను పరిశీలించి ఆయా యజమానులకు నాణ్యమైన సీడ్ ఉత్పత్తులపై పలు సూచనలు, సలహాలను ఇవ్వాల్సి ఉంది. ఐతే గత ఆరు నెలలుగా అలా జరగడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఒకప్పుడు జిల్లా తీరం వెంబడి దాదాపు 45 వేల ఎక్టార్లలో ఆక్వాసాగు చేసేవారు. ప్రస్తుత 15 వేల ఎక్టార్లకు పడిపోయింది.

స్టోరేజీ సౌకర్యం లేకనే..

జిల్లా నుంచి ఏటా దాదాపు 1.5 లక్షల టన్నుల రొయ్యలను ఉత్పత్తి చేస్తుంటారు. ధరలు ఆశాజనకంగా లేనప్పుడు వాటిని నిల్వ చేసుకునేందుకు సరైన స్టోరేజీలు లేకపోవడంతో ఒకటికి సగానికి తెగనమ్ముతున్నారు. ఇక కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లాలోని కౌలు రైతులకు ప్రాంతాన్ని బట్టి కౌలు నిర్ణయించారు. రూ. 50 వేల నుంచి రూ.లక్ష వరకు కౌలు ధర ఉంది. ప్రస్తుత ధరలతో పోల్చి చూస్తే కౌలు రైతుకు చివరకు మిగిలేది అప్పులే.

ఆరు రోజుల్లో రూ.60 తగ్గిపోయింది



రొయ్యల కొనుగోలుదారులు సిండికేట్లుగా ఏర్పడి ఆరు రోజుల నుంచి రోజుకి రూ.10 చొప్పున రూ. 60 తగ్గించేశారు. నెల కిందట 30 పైసలు ఉన్న రొయ్య పిల్ల ఇప్పుడు 55 పైసలకు పెంచారు. నాణ్యమైన సీడ్ దొరకడం లేదు. అంతా నకిలీల మయంగా మారింది. సాగులో తీవ్ర నష్టాలు వస్తున్నాయి. – ఎస్.మధురెడ్డి, ఆక్వా రైతు, ముట్టెంబాక

ఎకరాకు రూ.1.5 లక్షల నష్టం



ఓ పక్క ఆక్వా పెట్టుబడులు ఆమాంతంగా పెరిగిపోయాయి. లక్షలు పెట్టుబడులు పెట్టి 95 రోజులు కష్టపడి పండించిన రొయ్యలకు ధరలు తగ్గించేశారు. ఎకరా సాగులో దాదాపు రూ.1.5 లక్షల వరకు నష్టం వస్తోంది. – చెంగయ్య ఆక్వా రైతు పల్లిపాళెం

ఒడిదుడుకులు సహజం

అన్ని వ్యాపార రంగాలలో ఒడిదుడుకులు సహజం. ఆక్వా రంగంలోనూ నేడు ధరల హెచ్చ తగ్గులు సర్వ సాధారణంగా జరుగుతున్నాయి. ఎక్కడా దళారీ వ్యవస్థ, సిండకేటు వ్యవస్థ కొనసాగడం లేదు. బార్డ్ ఫ్లూ ఉన్నందున రొయ్యల ధరలు పుంజుకునే అవకాశం ఉంది. – మత్స్యశాఖ జేడీ వివరణ

యువత పోరుబాట



పోస్టర్ ఆవిష్కరిస్తున్న భూమన, శిరీష, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, అభినయ్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి తదితరులు

తిరుపతి మంగళం : విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా పేదల పిల్లల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని, ప్రజాద్రోహి చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకే ‘యువత పోరు’బాట పడుతోందని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం తిరుపతి పద్మావతిపురంలోని భూమన నివాసం వద్ద యువత పోరు పోస్టర్ ఆవిష్కరించారు. భూమన మాట్లాడుతూ విద్యార్థులకు వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12వ తేదీన కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగుతున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మోసపూరిత వైఖరిపై ప్రజలు మండిపడుతున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయలేదని విమర్శించారు. అధికార దాహంతో నోటికి వచ్చిన అబద్ధాలు చెప్పి ప్రజలను వంచించారని ఆరోపించారు. ఫీజులు చెల్లించకపోవడంతో విద్యార్థులను ఆయా కళాశాలు బయటకు పంపేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. 4 లక్షల ఉద్యోగాలు ఇస్తానని చంద్రబాబు ఊదరగొట్టి.. ఇప్పుడు నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారని మండిపడ్డారు. రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని యువతను దగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలకంటే ఎక్కువ అమలు చేసిన గొప్ప నేత జగనన్న అని కొనియాడారు. విద్యాదీవెనతో పేద విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేసిన దార్శనికుడన్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం చేసేందుకు చంద్రబాబు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను వేధించడంపై చూపుతున్న శ్రద్ధలో కాస్త పేదల సంక్షేమంపై కూడా పెట్టాలని స్పష్టం చేశారు. ఈ మేరకు యువత పోరు కార్యక్రమానికి విద్యార్థులు, నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. మేయర్ శిరీష, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల సమన్వయకర్తలు భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, కార్పొరేటర్ తమ్ముడు గణేష్, నేతలు నల్లాని బాబు, అజయ్‌కుమార్, ఉదయ్‌వంశీ, తులసీయాదవ్, దినేష్‌రాయల్, ఇమ్రాన్‌బాషా, ఓబుల్‌రెడ్డి, వెంకటేష్‌రాయల్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 28 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 74,646 మంది స్వామివారిని దర్శించుకోగా 74,646 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.52 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టోకెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

క్లుప్తంగా

వెటర్నరీ విద్యార్థుల ఆవేదన



నిరసన వ్యక్తం చేస్తున్న వెటర్నరీ జూడాలు

తిరుపతి సిటీ : గౌరవ వేతనం పెంచాలని 35 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వెటర్నరీ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వర్సిటీ వద్ద శిబిరంలో వారు మాట్లాడుతూ లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ ద్వారా ప్రభుత్వానికి రూ.60వేల కోట్లు జీడీపీ వస్తుంటే శ్రమిస్తున్న వెటర్నరీ జూడాలకు కేవ లం రూ.7వేలు ముష్టి వేస్తున్నారని వాపోయా రు. ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా వెట ర్నరీ రంగం ద్వారా వస్తున్న ఆదాయంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. తమ ఆత్మ గౌర వాన్ని కించపరుస్తున్నందుకు ఇప్పటికే అలిపిరి పాదాల చెంత శ్రీవారికి మొరపెట్టుకున్నామని తెలిపారు. సోమవారం చర్చికి వెళ్లి తమ గోడును విన్నవించుకుంటామని వెల్లడించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : గాజుల మండ్యం ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద పేకాట ఆడుతున్న 8 మందిని స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి నాలుగు బైక్‌లు, రూ.2.15 లక్షల నగదు స్వాధీనం చేసుకుని గాజుల మండ్యం పోలీసులకు అప్పగించారు.

తల్లీబిడ్డ అదృశ్యం

వెంకటగిరి రూరల్ : డక్కిలి మండలం మాటుమడుగుకు చెందని ఓ వివాహిత తన ఐదు నెలల బిడ్డతో సహా అదృశ్యమైంది. ఈ నెల 7వ తేదీన జరిగి ఈ ఘటనపై ఆదివారం ఫిర్యాదు అందినట్లు వెంకటగిరి సీఐ ఏవీ రమణ తెలిపారు.

వెంకటగిరిలో యువతి..

వెంకటగిరి పట్టణంలోని బొప్పాపురం శాల కాలనీకి చెందిన ఓ యువతి (16), ఈనెల 8వ తేదీన ఉదయం నుంచి కనిపించకుండా పోయింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు అందింది.

గుర్తుతెలియని మృతదేహం

బాలాయపల్లి మండలం కామకూరు 5వ బ్రాంచ్ కెనాల్ వద్ద గుర్తు తెలియని మృతదేహం (45) వెలుగుచూసింది. కాలువలో మృతదేహం కొట్టుకొచ్చినట్లు పోలీసులు తెలిపారు.

మట్టికొట్టేసేందుకు స్కెచ్!



యంత్రంతో చెరువును చదును చేస్తుండగా అడ్డుకుంటున్న గ్రామస్తులు

వరదయ్యపాళెం మండలంలోని బత్తలవల్లం పంచాయతీ కేంద్రంగా గ్రావెల్ అక్రమ రవాణా సాగించేందుకు అక్రమార్కులు సర్వం సిద్ధం చేసుకున్నారు. చెదురుపాకం చెరువు నుంచి తమిళనాడుకు మట్టి తరలించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు భారీ యంత్రాలను రంగంలోకి దించేశారు. లారీలను సైతం చెరువు వద్దకు తీసుకువచ్చేశారు. ఈ క్రమంలో సమాచారం అందుకున్న గ్రామస్తులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. మట్టి తవ్వితే సహించే ప్రసక్తే లేదని అడ్డుకున్నారు.

- అభివృద్ధి పనుల పేరిట అక్రమ అనుమతులు
- తమిళనాడుకు తరలించేందుకు సన్నాహాలు
- వ్యవహారం నడిపిస్తున్న టీడీపీ నేతలు
- అడ్డుకున్న బత్తవల్లం గ్రామస్తులు

వరదయ్యపాళెం : ఇసుక, గ్రావెల్ తరలింపునే ప్రధాన ఆదాయ వనరులుగా టీడీపీ నేతలు మార్చేసుకున్నారు. నిబంధలను గాలికి వదిలేసి ఇష్టారాజ్యంగా దందా సాగిస్తున్నారు. పలు ప్రాంతాల్లో అక్రమార్కులకు నేరుగా సహకారం అందిస్తున్నారు. అధికారం అండతో జేబులు నింపుకునేందుకు తెగబడిపోతున్నారు.

కాంట్రాక్టు పనుల పేరుతో..

తమిళనాడు ప్రాంతంలోని పొన్నేరి వద్ద కేంద్ర ప్రభుత్వానికి చెందిన అభివద్ధి పనులకు సంబంధించి గ్రావెల్ కావాలంటూ అక్రమార్కులు అనుమతులు పొందినట్లు సమాచారం. కాంట్రాక్టర్ ముసుగులో టీడీపీ స్థానిక నేతలతో సమన్వయం చేసుకున్నట్లు తెలిసింది. దీంతో అధికార పార్టీకి చెందిన నేతలు కొందరు రంగంలోకి దిగి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులపై ఒత్తిడి తెచ్చి అనుమతులు మంజూరు చేయించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు టీడీపీ నేతలు వాటాల కేటాయింపులు చేసుకుని రాత్రికి రాత్రే గ్రావెల్‌ను సరిహద్దులు దాటించేందుకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. అయినప్పటికీ తమిళనాడులో చేపట్టిన అభివద్ధి పనులకు ఇక్కడ నుంచి మట్టిని తరలించడమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అయితే అధికార టీడీపీ నేతలు మాత్రం పక్కా వ్యూహంతో గ్రావెల్ దందాతో రూ.కోట్లు గడించేందుకు పక్కా ప్రణాళిక అమలు చేస్తున్నట్లు తెలిసింది.

టీడీపీ నేతల మంతనాలు

చెదులుపాకం నుంచి తమిళనాడుకు అక్రమంగా గ్రావెల్ తరలించేందుకు టీడీపీ మండల నేతలు కొందరు సన్నద్ధమయ్యారు. ఆ దిశగా తమ పలుకుబడిని ఉపయోగించి పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ఒప్పించి దందాకు బాటలు వేసుకునేందుకు మంతానాలు సాగిస్తున్నట్లు సమాచారం.



చెదులుపాకం వద్ద మరోవైపు చదును చేస్తున్న యంత్రం



లారీల్లో తరలిస్తున్న మట్టి

నిబంధనలకు నీళ్లు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలు బహిరంగ సభల్లో ఇసుక, మట్టిని సరిహద్దులు దాటిస్తే కేసులు తప్పవని హెచ్చరించినా తమ్ముళ్లు మాత్రం బేఖాతర్ చేస్తున్నారు. నిబంధనలకు యథేచ్ఛగా నీళ్లు వదిలేస్తున్నారు. సత్యవేడు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి ఇష్టారాజ్యంగా మట్టిని తవ్వేసి తమిళనాడుకు తరలించేస్తున్నారు. అక్రమంగా రూ.కోట్లు కూడబెట్టుకుంటున్నారు. ఈ విషయాలన్నీ తెలిసినా అధికారులు మాత్రం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. అక్రమార్కులు అందించే మామూళ్ల మత్తులో జోగుతున్నారు.

ఆశావహులకు మొండిచేయి!

- ఉమ్మడి జిల్లాకు దక్కని ఎమ్మెల్సీ పదవి
- మాజీ ఎమ్మెల్యేలు, కూటమి నేతలకు షాక్

సాక్షి ప్రతినిధి, తిరుపతి : ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో ఉమ్మడి చిత్తూరు జిల్లా కూటమి నేతలకు చోటు దక్కలేదు. ఎమ్మెల్యే కోటా కింద ఆదివారం రాత్రి ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాలో ఆశావాహులందరికీ నిరాశే మిగిలింది. దీంతో కూటమి నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నామినేటెడ్ పదవుల భర్తీలో ఆశించిన స్థాయిలో చోటుదక్కలేదని మండిపడుతున్నారు. ఎమ్మెల్యే కోటాలో ఎంపిక చేసే ఎమ్మెల్సీ జాబితాలోనైనా ప్రాధాన్యమిస్తారనుకుంటే మళ్లీ మొండిచేయి చూపించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అసెంబ్లీ టికెట్లు ఆశించి భంగపడిన మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, సీకే బాబు, మనోహర్, ఎస్సీవీ నాయుడు, పరసారత్నం, ఎన్వీ ప్రసాద్, బీజేపీ నేత కోలా ఆనంద్, జనసేన నేత పసుపులేటి హరిప్రసాద్‌కు అధిష్టానం భారీ షాక్ ఇచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీ లేదా నామినేటెడ్ పదవుల్లో ఉన్నత పదవులు దక్కుతాయని ఆశ పడితే నిరాశే ఎదురైంది. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంలో.. అమరావతికి వెళ్లిన సమయంలో ఎవరికి వారు ఎమ్మెల్సీ పదవి గురించి ప్రస్తావించేవారని వారి వర్గీయులు చెబుతున్నారు. ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడ్డా.. ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పనిచేశామని పలుమార్లు విన్నవించినట్లు తెలిసింది. అదే విధంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, కూటమిలోని ముఖ్య నేతల ద్వారా ఎవరికి వారు ప్రయత్నాలు చేశారు. అయితే తాజాగా విడుదల చేసిన ఎమ్మెల్సీ జాబితాలో ఏ ఒక్కరికి చోటు దక్కకపోవటంతో మాజీ ఎమ్మెల్యేలు, వారి వర్గీయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వీరిలో కొందరు టీటీడీ పాలకమండలిలో చోటు కోసం ప్రయత్నించి విఫలమైన విషయం విదితమే.

భావి భారతావనికి భరోసా



మాట్లాడుతున్న ఎన్ఎస్‌యూ వీసీ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ : నూతన జాతీయ విద్యావిధానం భావి భారతావని భవితకు భరోసా కల్పిస్తుందని కేంద్ర విద్యాసంస్థల వీసీలు, మేధావులు తెలిపారు. ఆదివారం తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ–2020పై రెండు రోజుల జాతీయ సదస్సు ఆదివారం ప్రారంభమైంది. పలువురు వక్తలు మాట్లాడుతూ విజ్ఞాన పరంపరను జాతీయ విద్యావిధానంలో అనుసంధానించారన్నారు. ఎన్ఈపీ విశ్వగురువుగా భారత్ ప్రథమ స్థానంలో నిలుస్తుందని వెల్లడించారు. ప్రపంచ స్థాయి పోటీని ఎదుర్కొనే స్థాయిలో సమూల మార్పులు చేయడం హర్షణీయమని కొనియాడారు. దర్భంగా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ లక్ష్మీనివాస్ పాండే, మాజీ వీసీ ప్రొఫెసర్ పరమేశ్వరనారాయణ, సోమనాథ్ వర్సిటీ మాజీ వీసీ అర్కనాథ్ చౌదరి, మాజీ డీన్ ప్రొఫెసర్ రవిశంకర మీనన్, ఢిల్లీ సంస్కృత సంవర్ధన డైరెక్టర్ కిరణ్ సులూజా, ఎన్ఎస్‌యూ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, డీన్ ప్రొఫెసర్ దక్షిణామూర్తి శర్మ, ప్రొఫెసర్ ఆర్‌జీ త్రిపాఠి, ప్రొఫెసర్ సచ్చిదానందమూర్తి పాల్గొన్నారు.

మానవ హక్కుల రక్షణకు కృషి



విద్యార్థినులకు జ్ఞాపికలు అందిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: దేశంలో బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలబడి మానవహక్కుల పరిరక్షణకు కృషి చేయాలని ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ డాక్టర్ సంపత్ కుమార్ స్పష్టం చేశారు. ఆదివారం తిరుపతిలోని ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మూడో వార్షికోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హక్కుల ఉల్లంఘనలపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ టీమ్ వెంటనే స్పందిస్తూ బాధితులకు న్యాయం అందిస్తోందన్నారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం విద్యార్థులు, నిపుణులు, మేధావులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం వారికి జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ప్రభాకర్‌రెడ్డి, హ్యూమన్‌రైట్స్ ప్రతినిధులు బుల్లెట్ రవి, భాస్కర్, మేఘన, హరీఫ్, రమేష్ , మణి, శివకృష్ణ, పూర్ణచంద్రా రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘం ఎంపిక



కొత్తగా ఎంపికైన వారిని సన్మానిస్తున్న ఉద్యోగులు



రావులపాటి శ్రీనివాసరావు



కాకునూరి చెన్నకేశవులు

తిరుపతి అర్బన్: వాణిజ్య పన్నుల శాఖ 4వ తరగతి ఉద్యోగుల సంఘాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నారు. తిరుపతిలోని అన్నమయ్య సర్కిల్ సమీపంలోని సీటీఓ ఆఫీస్ కాంప్లెక్స్‌లో ఆదివారం రాష్ట్ర కార్యవర్గం సమావేశం నిర్వహించారు. అయితే ఇటీవల రాష్ట్ర అధ్యక్షులు బాపట్ల గోపాలకృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం మునిగేషన్, రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి ఎలమంచిలి శ్రీనివాస్ వ్యక్తిగత కారణాలతో తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ క్రమంలో ఆ మూడు పదవులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. రాష్ట్ర అధ్యక్షులుగా రావులపాటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కాకునూరి చెన్నకేశవులు, రాష్ట్ర కార్యాలయ కార్యదర్శిగా సత్యనారాయణను ఎంపికచేశారు. నూతనంగా ఎంపికైన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో 4వ తరగతి ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు సుబ్బయ్య సుబ్రహ్మణ్యం, మాజీ అధ్యక్షులు కేఎస్ వీరయ్య, పి గోవిందరాజులు నాయుడు, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శివశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్స్ యజమానిపై కేసు నమోదు

తిరుమల : శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లను భక్తులకు అధిక ధరలకు విక్రయించిన ట్రావెల్స్ యజమానిపై తిరుమల వన్ టౌన్ పోలీసులు కేసును శనివారం నమోదు చేశారు. తిరుమల టూ టౌన్ పోలీసులు, విజిలెన్స్ వింగ్ అధికారులు తెలిపిన వివరాల మేరకు బెంగళూరుకు చెందిన డి.శ్రీనివాసన్ శ్రీవారి దర్శనం కోసం చెన్నైకు చెందిన ఏపీ టూర్ ట్రావెల్స్ సంస్థ యజమాని థామస్‌ను సంప్రదించాడు. ఇతను నాలుగు వీఐపీ బ్రేక్ దర్శన టికెట్ల కోసం రూ.60వేలను భక్తుడి నుంచి వసూలు చేశాడు. అయితే తిరుమలకు చేరుకున్న భక్తులు తాము శ్రీవారి దర్శనం టికెట్లను అధిక ధరలకు కొని మోసపోయామని గుర్తించి టీటీడీ విజిలెన్స్ వింగ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విజిలెన్స్ అధికారులు భక్తులను విచారించి వారి ద్వారా తిరుమల వన్‌టౌన్ పీఎస్‌లో దళారీ థామస్ కేసును నమోదు చేయించారు.

ఎక్కడికక్కడ అరెస్ట్



నాయుడుపేట పోలీస్‌స్టేషన్‌లో అంగన్‌వాడీలు

తిరుపతి అర్బన్: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారు. నేడు విజయవాడలో జరగనున్న మహాధర్నాకు తరలి వెళ్తున్న కార్యకర్తలపై పోలీసులు జులుం ప్రదర్శించారు. ధర్నాకు వెళ్లకుండా బస్సులు, ట్రైన్లలో వెళ్తున్న వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు.

బంగారు తిరుచ్చిపై సీతారాములు



బంగారు తిరుచ్చిపై భక్తులను అనుగ్రహిస్తున్న సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రుడు

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారికి అనుబంధంగా వెలసిన శ్రీసీతారాముల వారు ఆదివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిచ్చారు. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, సూరింటెండెంట్ రమేష్‌బాబు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

తిరుమలలో టీటీడీ అటవీ కార్మికుడికి ప్రమాదం

- చికిత్స పొందుతూ స్విమ్స్‌లో మృతి
- పరిహారం కోసం సీఐటీయూ డిమాండ్



యానాదయ్య(ఫైల్)

తిరుమల: తిరుమలలో విధులు నిర్వహిస్తూ ప్రమాదానికి గురైన అటవీ శాఖ కార్మికుడు చికిత్స పొందుతూ ఆదివారం సిమ్స్‌లో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. తిరుమల నందకం ఏరియాలో విధుల్లో ఉన్న టీటీడీ అటవీ కార్మికుడు పీ.యానాదయ్య (59) ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పై నుంచి కిందపడ్డాడు. కాళ్ల మీదుగా ట్రాక్టర్ చక్రం ఎక్కడంతో యానాదయ్య తీవ్ర గాయాలకు గురయ్యారు. వెంటనే అశ్విని ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రికి, అక్కడి నుంచి స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యానాదయ్య మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి స్విమ్స్‌కు చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. టీటీడీ అటవీ విభాగంలో వయసు పైబడిన వారికి ... వారు చేయలేని పనులు అప్పజెప్పి వారి మరణానికి టీటీడీ అధికారులు కారణమయ్యారని ఆరోపించారు. మృతుని కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించి, ఆయనపై ఆధారపడి ఉన్న వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి టీటీడీలో శాశ్వత ఉద్యోగం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

19న చలో విజయవాడ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

తిరుపతి కల్చరల్: కూటమి ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేస్తామన్న అనాలోచిత నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ నెల 19వ తేదీన చేపట్టే చలో విజయవాడ కార్యక్రమానికి ఆప్కాస్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు హాజరై జయప్రదం చేయాలని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ జేఏసీ చైర్మన్, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం యశోదనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన చలో విజయవాడ కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడం దుర్మార్గమన్నారు. కూటమి అనాలోచిత నిర్ణయంతో లక్షా 20 వేల మంది నష్టపోయే ప్రమాదముందన్నారు. ప్రభుత్వ నిర్వహణలో నడుస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌ను మళ్లీ ఏజెన్సీలకు ఇవ్వాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ జిల్లా జేఏసీ చైర్మన్ నాగ వెంకటేష్, ప్రభాకర్‌రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

అమ్మనాన్న వెళ్లొస్తానని.. అనంతలోకాలకు

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం
- లారీ డ్రైవర్ పరార్



ఘటనా స్థలంలో లారీ



మృతుడు అంకయ్య(ఫైల్)

చిట్టమూరు: నాయుడుపేట–మల్లాం రహదారి మార్గం, చిట్టమూరు మండలంలోని అరవపాళెం జెడ్పీ హైస్కూల్ సమీపంలో లారీ మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. ఏఎస్ఐ నాగేశ్వరరావు వివరాల మేరకు.. వాకాడు మండలం, గొల్లపాళెం గ్రామానికి చెందిన బందిలి కిష్టయ్య, శ్యామలమ్మ రెండో కుమారు బందిలి అంకయ్య(23) మోటార్ సైకిల్‌పై నాయుడుపేట నుంచి గొల్లపాళెం వస్తున్నాడు. అదే సమయంలో అరవపాళెం వద్ద లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు అంకయ్య తడ శ్రీసిటీలో ఓ ప్రయివేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో కంపెనీ వద్ద నుంచి మోటార్ సైకిల్‌పై నాయుడుపేట గురుకుల పాఠశాల్లో చదువుతున్న తమ బంధువుల పిల్లల వద్దకు వెళ్లి, అక్కడి నుంచి చిట్టమూరు మండలం, ఎల్లసిరి గ్రామంలో గత నెల రోజులుగా అక్కడే ఉంటూ గొర్రెలు మోపుకుంటున్న తల్లిదండ్రుల వద్దకు బయలుదేరాడు. అక్కడ అమ్మ, నాన్న నేను మన ఊరు గొల్లపాళెం వెళ్లి అక్కడి నుంచి కంపెనీకి వెళ్తానని చెప్పి మోటార్ సైకిల్ బయలు దేరాడు. ఆ తర్వాత కొంతసేపటికే అరవపాళెం గ్రామ జెడ్పీ హైస్కూల్ సమీపంలో మల్లాం వైపుగా వస్తున్న లారీ మోటార్ సైకిల్‌ను ఢీకొట్టడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. మృతుడు అంకయ్య స్వగ్రామం గొల్లపాళెంకు చెందిన వారు ఆటోలో వస్తూ గుర్తించి చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే అంకయ్య మృతిచెందినట్టు ధ్రువీకరించారు. ఈ ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ లారీని అక్కడే వదిలి పరారయ్యాడు. కేసు దర్యాప్తులో ఉంది.

విహంగం.. విన్యాసం



గూడబాతుల పిల్లల గుంపు

నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో విదేశీ విహంగాలు సందడి చేస్తున్నాయి. కడప చెట్లపై పక్షులు పెట్టిన గుడ్ల నుంచి వచ్చిన పిల్లలు కనువిందు చేస్తున్నాయి. చెరువులో ఈదుతూ చేస్తున్న విన్యాసాలు వీక్షకులను కట్టిపడేస్తున్నాయి. పెద్ద పక్షులు పులికాట్‌లో వేటాడి ఆహారం అందిస్తున్నాయి. ఈ మేరకు అన్ని జాతుల విహంగాలు కలిపి సుమారు 17,500 వరకు విడిది చేస్తున్నట్లు వన్యప్రాణి విభాగం అధికారులు తెలియజేస్తున్నారు. అలాగే 2,500లకు పైగా పిల్లలన పొదిగినట్లు వివరిస్తున్నారు. ఏప్రిల్‌కు సీజన్ ముగియనున్నట్లు వెల్లడిస్తున్నారు. – దొరవారిసత్రం




ఎగిరేందుకు ప్రత్నిస్తున్న నీటి కాకి పక్షి పిల్ల



విహరిస్తున్న నత్తగుల్లకొంగ పిల్ల



చెరువు నీటిలో గూడబాతు పిల్లల విన్యాసాలు



ఎగిరే స్థాయికి చేరిన తెల్లకంకణాయి పక్షి పిల్ల



తెడ్డుముక్కు పిల్లలు



సాక్షి క్లాసిఫైడ్స్



DIRECT FINAL YEAR

Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry 9381287629

10th, Inter, BA, B.Com, B.Sc, BBA, BCA, BLIS, MA, M.Com, M.Sc, MCA, MBA, MLIS, Dip, B.Tech, M.Tech, M.Phil, Ph.D., BNYS, BPT: ✆ 9032030124.



WANTED

లీజుకు కావలెను. తిరుపతిలో రెడ్డి & రెడ్డి కాలనీ / భవాని నగర్ నందు 1500 Sqft to 2000 Sqft గల భవనం హాస్పిటల్ కొరకు Long Leaseకు కావలెను. 94901 64783.



Wanted Tele Callers, Office Managers, Marketing Officers, Salary: 12K-25K P.M+Incentives, RKC Group: 9000637999, 8801501376.

మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3,500 సంపాదించుకోండి. వివరాలకు వాట్సాప్‌లో Hi అని మెసేజ్‌చేసి కాల్ చేయండి. 82478 08801.

MS Pvt Ltd నందు టెలి కాలింగ్ చేయుటకు మేల్/ఫిమేల్ కావలెను. పార్ట్ టైమ్/ఫుల్ టైమ్, Qly: 10th, జీతం : 16000 to 18000, Ph: 9550853907

కష్టమైన్న కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ. 15 వేలు - 40వేలు, ఫ్రీ రూం+భోజనం. HYD. 6309020999

ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీ:20k ఫోన్: 8977639663, 8977639962

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact 9705444178 9951602970

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.